అకాల వర్షానికి నేలకొరిగిన పంటలు


మోటువారిపల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట


నేలకూలిన ఇంటి ప్రహరీ


నేలకూలిన భారీ వృక్షం

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం, దుద్దేబండ, మోటూవారిపల్లి, వెంకటగిరి పాళ్యం గ్రామాల్లో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న పంట నేలకూలింది. మండలంలోని దాదాపుగా 100 ఎకరాల మేర మొక్కజొన్న పంట దెబ్బతినింది. దుద్దేబండలో రవీంద్రారెడ్డికి చెందిన ఆరు ఎకరాలు, గొల్లపల్లి ప్రకాష్ రెడ్డి మూడెకరాలు, సుధాకర్‌రెడ్డి 4 ఎకరాలు, చంద్రారెడ్డి 3 ఎకరాలు, నరసింహారెడ్డి 5 ఎకరాలు, ముకుంద 4 ఎకరాలు, మల్లికార్జున 9 ఎకరాల్లో పంట దెబ్బతినింది. మోటూవారిపల్లి కి చెందిన మైలారప్ప 5 ఎకరాలు, బాలకృష్ణ 2 ఎకరాలు, మల్లికార్జున 4 ఎకరాలు, దుబ్బు వెంకట రెడ్డి 4 ఎకరాలు, దామోదర్ 4 ఎకరాలు, వడ్డి సుబ్బరాయుడు 3 ఎకరాలు, కృష్ణారెడ్డి 3 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకూలింది. పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి పంపుతామని ఏఓ సురేంద్రనాయక్ తెలిపారు.

క్లుప్తంగా

ఇంటర్ పరీక్షలకు 18 మంది గైర్హాజరు

మడకశిర: పట్టణంలోని మూడు కేంద్రాల్లో శనివారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం 1,027 మంది విద్యార్థులకు గాను 1,009 మంది హాజరయ్యారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 414 మందికి గాను 405 మంది, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 375 మందికి గాను 372 మంది, వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 238 మందికి గాను 232 మంది హాజరయ్యారని తెలియజేశారు. ఇదిలా ఉండగా అగళిలోని మోడల్ జూనియర్ కళాశాలలో జరిగిన ఇంటర్ పరీక్షలకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం 187 మంది విద్యార్థులకు గాను 182 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ చక్రధారి పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షకు ఆరుగురు గైర్హాజరు

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీలో ఇంటర్మీడియెట్ పరీక్ష సజావుగా జరిగింది. శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 301 మంది హాజరుకావాల్సి ఉండగా, 295 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన


ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ అధికారులు శనివారం పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని, వచ్చే నెలలో పునాది బిల్లులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నాగరాజు, ఏఈ ఖాజామైనుద్దీన్, వర్క్ఇన్‌స్పెక్టర్ రంగస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సోని పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మడకశిర: మండలంలోనే కాకుండా పట్టణంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈనేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ నాగేంద్ర ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజలు పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు బంగారు, వెండి ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను భద్రంగా ఉంచి వెళ్లాలని కోరారు. వేసవి కాలం కావడంతో ఇంటి బయట నిద్ర పోతున్నప్పుడు ఇంటికి తాళాలు వేసుకుని పడుకోవాలని సూచించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫేర్

హిందూపురం టౌన్: స్థానిక 30వ వార్డులోని ఆల్‌హిరా పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రహమత్, ఎంఈఓ గంగప్ప, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, వేణుగోపాల్, రియాజ్ సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు వివిధ రకాల నమూనాలను రూపొందించి ప్రదర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఘనంగా సరస్వతీపూజ


సరస్వతి పూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెనుకొండ రూరల్: మావటూరు హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరాపురం: హేమావతి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు గోవిందప్ప,ఉమేష్, తిప్పేస్వామి, కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిమడుగులో ఘర్షణ

పెనుకొండ రూరల్: మునిమడుగు గ్రామంలో శనివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు ఘర్షణ పడ్డారు. గ్రామానికి చెందిన వడ్డే మల్లికార్జున, మహేష్ అదే గ్రామానికి చెందిన శేషాద్రిపై దాడి చేశారు. బాధితుడు కియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మహిళ అదృశ్యం

పెనుకొండ రూరల్: మునిమడుగుకు చెందిన వడ్డే అరుణ అనే మహిళ రెండురోజులుగా కనిపించలేదని భర్త మల్లికార్జున కియా పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

రొళ్ల: కొడగార్లగుట్ట గ్రామ సమీపాన జాతీయ రహదారి పక్కన శనివారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు.. కొడగార్లగుట్ట గ్రామ సమీపాన జాతీయ రహదారి పక్కన తిమ్మప్ప మామిడి తోట వద్ద పునాది రాళ్లు లోడును అన్‌లోడు చేస్తుండగా ట్రాక్టర్ ట్రైలర్ వెనకాలే ఉన్న గుంతలోకి ఈడ్చుకుని వెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ శివకుమార్ చాకచక్యంగా కిందకి దూకడంతో ప్రమాదం తప్పింది. దీంతో అందురు ఊపిరిపీల్చుకున్నారు. తర్వాత జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను బయటికి తీశారు.

సెల్‌ఫోన్ షోరూములో మరమ్మతు చేయొద్దు


మాట్లాడుతున్న సెల్‌ఫోన్ మరమ్మతు యూనియన్ అసోసియేషన్ సభ్యులు

హిందూపురం: పట్టణంలోని షోరూంలలో సెల్‌ఫోన్ల మరమ్మతు, పరికరాల విక్రయం చేయరాదని సెల్‌పాయింట్ అసోసియేషన్ నాయకులు ఇబ్రహీం, బద్రీ, చంద్ర డిమాండ్ చేశారు. శనివారం సెల్ రిపేరీ దుకాణాలు బంద్ చేపట్టి స్థానిక ఏఎంఎస్ ఫంక్షన్‌లో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ షోరూంలలోనే ఎక్ససరీలు విక్రయించడడం వల్ల చిన్న దుకాణాల్లో వ్యాపారాలు తగ్గిపోయాయన్నారు. అంతేగాక మరమ్మతులకు కూడా దుకాణాలకు రావడం లేదన్నారు. దీనివల్ల సెల్‌ఫోన్ మరమ్మతులపై ఆధారపడి జీవనం చేస్తున్న మెకానిక్‌లకు ఉపాధి కరువైందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే సెల్‌ఫోన్ రిపేరి దుకాణ కార్మికులు రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. మరమ్మతు చేయమని షోరూం నిర్వాహకులు రాతపూర్వకంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉమేష్, వెంకటేష్, ముసఫీర్, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం


లోక్ అదాలత్‌నిర్వహిస్తున్న ఏడీజే శైలజ

హిందూపురం: లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు హిందూపురం అదనపు జిల్లా జడ్జి శైలజ అన్నారు. శనివారం ఏడీజే కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఏడీజే మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. తాజాగా వైవాహిక సంబంధాల కేసులకు ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించామన్నారు. సమస్యలను క్షుణంగా తెలుసుకుని, ఇరువర్గాలతో చర్చించి ఎనిమిది కేసులను పరిష్కరించామన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా మానసిక ప్రశాంత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నాగప్ప, సుదర్శన్, న్యాయవాదులు నాగభూషణరావు, కృష్ణారెడ్డి, నాగరాజు, రామిరెడ్డి, సుధాకర్, సంతోషికుమారి, సంపత్‌కుమార్, లోక్ అదాలత్ సభ్యులు శారద, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో మరోసారి ఎమ్మెల్యే తిప్పేస్వామి భేటీ


సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం ఎమ్మెల్యే తిప్పేస్వామి అసెంబ్లీలో మరోసారి భేటీ అయ్యారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కలిసిన విషయం తెలిసిందే. తాజాగా జరిగిన భేటీలో నియోజకవర్గంలో అర్ధంతరంగా ఆగిపోయిన పలు భవనాలను పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే ఫోన్‌లో సాక్షికి తెలిపారు. ముఖ్యంగా సచివాలయాలు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో నిలిచిపోయిన పనులను పూర్తి చేయడానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వివరించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

హిందూపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కృష్ణవేణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఆర్టీసీ కాలనీ, త్యాగరాజనగర్, చైతన్యనగర్, రహమత్‌పురం, సీపీఐ కాలనీ, సిల్క్‌కాలనీ, శ్రీకంఠపురం ఏరియా, మోడల్ కాలనీ, డీబీ కాలనీ, నానెప్పనగర్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మల తొలగింపుతోపాటు విద్యుత్తు తీగలు సరిచేయడం, మరమ్మతు చేపడుతుండటం వల్ల కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆమె సూచించారు.

ఆర్‌జీవీపై చర్యలు తీసుకోవాలి

పరిగి: సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో మహిళ ఆత్మగౌరవం కించపరిచేలా చేసిన వ్యాఖ్యలు సరికావని అఖిల భారత మహిళా సాంస్కృతిక సంఘం పరిగి మండల కమిటీ ఇన్‌చార్జ్ ఎస్‌ఎం కీర్తి మండిపడ్డారు. శనివారం ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన రామ్‌గోపాల్‌వర్మ అసభ్యకర వ్యాఖ్యలు చేశారన్నారు. ఏదైనా వైరస్ వచ్చి మగజాతి అంతరించిపోయి, తాను మాత్రమే బతికి స్త్రీ జాతికి దిక్కవుతానని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇలా దారుణమైన వ్యాఖ్యలు చేసిన రామ్‌గోపాల్‌వర్మపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

ముందస్తు ఉగాది సంబరాలు

హిందూపురం: స్థానిక నింకంపల్లిలోని బాలయేసు విద్యాలయంలో శుభకృతు నామ ఉగాది నూతన సంవత్సర పర్వదిన సంబరాలు ముందస్తుగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మామిడి తోరణాలు, బంతిపూల అలంకరణలు, రంగవల్లులతో పండుగ వాతావరణం నిండుకుంది. ఉగాది పచ్చడి, కొబ్బరి ఓళిగలు, ప్రత్యేక వంటలు సిద్ధం చేశారు. అనంతరం సరస్వతీదేవి పూజ నిర్వహించారు. హెచ్‌ఎం నిర్మల శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

21, 22 తేదీల్లో కబడ్డీ పోటీలు

అమడగూరు: ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని జేకేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే కబడ్డీ పోటీల్లో పాల్గొనాలని నిర్వాహకులు హరీష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు రూ.500 ఫీజు చెల్లించాలన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు.

హుండీ కానుకల లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

రొళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం హుండీ కానుకలను లెక్కించారు. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు హుండీ కానుకలను లెక్కించారు. బ్రహ్మోత్సవాలో భాగంగా హుండీల ద్వారా రూ.3.83 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టామని ఈఓఆర్డీ శైలజ శనివారం తెలిపారు. సర్పంచుల సహకారంతో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే గ్రామ కార్యదర్శులకు తెలియజేశామన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో తాగునీటి సమస్య లేదన్నారు.

23న దివ్యాంగులకు ఉచిత పరీక్షలు

లేపాక్షి: హిందూపురం పట్టణంలోని భవిత కేంద్రంలో ఈనెల 23న దివ్యాంగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని ఎంఈఓ నాగరాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలనిన్నారు. వివరాలకు 6281834232, 63006 16106 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

మడకశిరరూరల్: ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు కూలీలకు సూచించారు. ఆయన శనివారం కదిరేపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. పనుల చేసే చోట నీడ, తాగునీరు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెలలోపు 100 పని దినాలు పూర్తి చేసుకోవాలన్నారు.

తల్లీకూతురి ఆచూకీ లభ్యం

రొళ్ల: రొళ్లవడ్రహట్టి గ్రామానికి చెందిన ఈరన్న భార్య సువర్ణ ఆమె కుమార్తె లహరితో కలిసి ఈనెల 5న అదృశ్యమైనట్లు భర్త ఈరన్న రొళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈక్రమంలో తల్లీకూతురు ఉన్నఫళంగా శనివారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. వారిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఎదుట హాజరు పరిచి అనంతరం వారి కుటుంబ సభ్యులకు గ్రామ పెద్ద మనుషుల సమక్షంలో అప్పగించినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

జూదరుల అరెస్టు


జూదరులతో ఎస్‌ఐ, పోలీసులు

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు గ్రామ శివారులో పేకాట స్థావరాలపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పొలాల సమీపంలో ముళ్లచెట్ల వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.2700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి


రొద్దంలో ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

రొద్దం: వైద్య సిబ్బంది ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందులు, సిబ్బంది పనితీరు, ఓపీపై ఆరా తీశారు. డాక్టర్ల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. అక్కడున్న రోగులతో ఆస్పత్రిలో అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. సానిపల్లిలో పర్యటించి, వైద్య సిబ్బంది పనితీరుపై గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ ఎన్నిక


ప్రీకాట్ బీ మిల్లు నూతన కమిటీ సభ్యులు

హిందూపురం టౌన్: ఏఐటీయూసీ అనుబంధ ప్రీకాట్ బీ మిల్ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా వేమయ్య, అధ్యక్షుడిగా బయన్న, ప్రధాన కార్యదర్శిగా మారుతీరెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శిగా వినోద్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగాధర్, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా మాచప్ప, నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శులుగా జగదీష్, ఆదినారాయణ, ఈసీ మెంబర్లుగా లక్ష్మీనారాయణ, రామాంజి, కేశవరెడ్డి, లక్ష్మీనరసప్ప ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, చేనేత కార్మిక సంఘం నాయకుడు వెంకటేష్, పట్టణ నాయకులు ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'జిల్లాధికారి నడక' సద్వినియోగం చేసుకోండి


మహిళకు భాగ్యలక్ష్మి కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: జిల్లాధికారి నడక–పల్లె దాక అనే ప్రభుత్వ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప సూచించారు. తాలూకా లోని వళ్ళూరులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నయాపైసా ఖర్చు లేకుండా, పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్దకు తిరిగే సమస్య లేకుండా ఏకంగా ప్రభుత్వ అధికారులే మీ ఇళ్ల వద్దకు వచ్చి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ ఏడీ విజయ మూర్తి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రైతులకు స్ప్రింక్లర్స్‌ను అందించారు. అదే విధంగా స్త్రీ శిశు సంక్షేమశాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పింఛన్లు, భాగ్యలక్ష్మి కార్డులను పంపిణీ చేశారు. తహసీల్దార్ సుజాత, ఈఓ శివరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నడ భాషకు చట్టబద్ధత కల్పించాలి


సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప, స్వామి జపానంద

పావగడ: కన్నడ భాషకు చట్టబద్ధత కల్పించాలని ప్రఖ్యాత నవలాకారుడు నృపతుంగ అవార్డు గ్రహీత డా వీరభద్రప్ప అభిప్రాయపడ్డారు. స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో శనివారం నిర్వహించిన 7వ కన్నడ సాహిత్య సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర సరిహద్దు లో ఉన్న పావగడలో తెలుగు, కన్నడ భాషల సంస్కృతి ఎక్కువగా కన్పిస్తుందన్నారు. ప్రపంచంలోనే అతి సుందరమైన భాష కన్నడ అని కొనియాడారు. కర్ణాటకలో నివసించే ప్రతి ఒక్కరూ కన్నడ భాష లోనే మాట్లాడాలన్నారు. స్థానిక కసాప, కన్నడ పర సంఘాలు పావగడ లో కన్నడ భాషాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప మాట్లాడుతూ పావగడ చుట్టూ ఆంధ్రప్రదేశ్ ఉండడంతో తెలుగు భాష ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. ఇక్కడ చదివేది కన్నడ, రాసేది కన్నడ అయితే మాట్లాడేది మాత్రం తెలుగు అని చమత్కరించారు. నిడుగల్ హోబళిలో మాత్రం కన్నడ భాష ఉందని, అయితే నాగలమడక హోబళిలో అధికంగా తెలుగు భాష రాజ్యమేలుతోందన్నారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు, కన్నడ భాష మేధావులు తమ పిల్లల్ని ఇంగ్లిష్ భాష మాధ్యమంలో చదివిస్తుండడంతోనే కన్నడ భాష కనుమరుగవుతోందన్నారు. స్వామి జపానంద, హెచ్ రామచంద్రప్ప, చెలువరాజన్, జిల్లా కసాప అధ్యక్షుడు సిద్ధలింగప్ప, పావగడ కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి కన్నడ భాష అభివృద్ధి గురించి మాట్లాడారు. పలువురు రచించిన కన్నడ సాహిత్య పుస్తకాలను విడుదల చేశారు. తొలుత గురు భవన్ నుంచి సమ్మేళనం వేదిక వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం జరిగిన కవి గోష్ఠి అందరినీ ఆకట్టుకుంది.

31న సామూహిక వివాహాలు


కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఈనెల 31న ఉచిత సాముహిక వివాహాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం సామూహిక వివాహాల నిర్వహణపై గ్రామస్తులతో చర్చించారు. అనంతరం ఉచిత సామూహిక వివాహాల కరపత్రాలను విడుదల చేశారు. అన్ని గ్రామాల్లో ప్రజలకు తెలియజేసి సామూహిక వివాహాలను విజయవంతం చేయాలని కోరారు.

యాంత్రీకరణపై రైతులను ప్రోత్సహిద్దాం

- డీఏఓ సుబ్బారావు


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఏఓ సుబ్బారావు

రొళ్ల: వ్యవసాయంలో యంత్ర పరికరాల ఉపయోగంపై రైతులను ప్రోత్సహిద్దామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) సుబ్బారావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలోని రైతు భరోసా కేంద్రంలో రొళ్ల, అగళి మండలంలోని ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 'వైఎస్సార్ యంత్ర సేవా పథకం'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏఓ సుబ్బారావు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, రొటావేటర్లు, కల్టివేటర్లు, మినీ ట్రాక్టర్లు తదితర పనిముట్లు అందిస్తున్నామన్నారు. రొళ్ల, అగళి మండలాల్లో 21 ఆర్‌బీకే సెంటర్లలో ఒక్కో సెంటర్ కింద ఐదుగురితో కూడిన గ్రూపులను కూడా ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. అర్హతను బట్టి రూ.15 లక్షల విలువ చేసే పనిముట్లను అందిస్తామన్నారు. బ్యాంక్ ద్వారా 50 శాతం సబ్సిడీ కూడా అందిస్తామని, మిగిలిన మొత్తాన్ని గ్రూపు సభ్యులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. త్వరితగతిన రైతు వాటా కట్టించడానికి కృషి చేయాలన్నారు. పీఎం కిసాన్ ద్వారా ప్రతి రైతుకు సాయం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు కియోస్క్ ద్వారా నివేదికలు సమర్పించి ఎరువులను తెప్పించుకోవాలని సూచించారు. పంటల వివరాలను తప్పని సరిగా ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండి రైతులకు సలహాలు, సూచనలు తెలియజేయాలన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పరికరాల పథకాలకు సంబంధించి గ్రూప్ సభ్యుల వివరాలను ఈ నెల 24 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మడకశిర ఏడీఏ క్రిష్ణమీనన్, రొళ్ల, అగళి ఏఓలు రాజ్యలక్ష్మీ, శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.